# ఆకాశమే హద్దుగా..!

## హైరైస్ అడ్డాగా ఎల్‌బీనగర్ గడ్డ!

- నాడు శివారు ప్రాంతం... నేడు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లకు కేరాఫ్
- త్వరలో మరో రెండు ఫ్లై ఓవర్ల నిర్మాణాలకు అంచనాలు
- భారీగా మౌలిక వసతుల కల్పన
- ఇటీవల కాలంలో పలు నిర్మాణాలకు అనుమతులు



బైరమల్‌గూడ జంక్షన్ వద్ద నిర్మించిన స్కైవేతోపాటు ఫ్లై ఓవర్ బ్రిడ్జి

**ఎల్‌బీనగర్:** ఒకప్పుడు శివారు ప్రాంతంగా ఉన్న ఎల్‌బీనగర్ ఇప్పుడు బహుళ అంతస్తుల భవనాలు... ఆకాశాన్ని తాకేలా ఉన్న హైరైస్ భవంతులకు చిరునామాగా మారింది. వివిధ వృత్తి ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం రెండు రాష్ట్రాలతో పాటు దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది ఈ ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతుండడంతో పదుల సంఖ్యలో హైరైస్ బిల్డింగులు శరవేగంగా నిర్మాణాలు అవుతున్నాయి. ఇటీవల కాలంలో ఎల్‌బీనగర్‌లో పలు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లతోపాటు పలు జంక్షన్లు విస్తరణతో నియోజకవర్గ పరిధిలో ట్రాఫిక్ చిక్కుముడులు వీడాయి. తాగునీరు, డ్రైనేజీ వసతుల కల్పన అంతర్గత రహదారుల విస్తరణతో నియోజకవర్గ పరిధిలోని ఎల్‌బీనగర్, మన్సూరాబాద్, నాగోలు వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో భారీగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి.

**రెండు రాష్ట్రాలకు గేట్‌వేగా......**

తెలుగు రెండు రాష్ట్రాలకు ఎల్‌బీనగర్ ప్రాంతం గేట్‌వేగా మారింది. ఒకప్పుడు అక్కడో ఇళ్లు ఇక్కడో ఇళ్లుగా ఉండే ఎల్‌బీనగర్ ప్రాంతం ఇప్పుడు భారీగా విస్తరించడండో ఈ ప్రాంత రూపురేఖలు మారాయి. నిత్యం ఆంధ్రా ప్రాంతం నుంచి వందల సంఖ్యలో బస్సుల రాకపోకలు ఇటు తెలంగాణ ప్రాంతంలోని పలు పట్టణాలకు ఇక్కడ నుంచే రవాణా సౌకర్యం ఉండడవతో నిత్యం బస్సులతో పాటు ప్రయాణికులతో సందడిగా మారింది.

**సిగ్నల్ లెస్ జర్నీగా...**

ఎల్‌బీనగర్ ప్రాంతం ఒకప్పుడు నిత్యం ట్రాఫిక్ సుడిగుండంగా ఉండేది. ఒకప్పుడు ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు నుంచి బయట పడాలంటే అరగంటకుపైగా సమయం పట్టేది. దీంతో నిత్యం వాహనదారులు నరకం చూసేవారు. ఈ సమస్య నుంచి విముక్తి కలిగేందుకు తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత కొత్తగా వచ్చిన ప్రభుత్వం 2014లో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు సిగ్నల్‌లెస్ జర్నీగా మార్చాలని ప్రణాళికలు రచించారు. ఇందులో భాగంగా ఎల్‌బీనగర్‌లో సుమారుగా రూ.657 కోట్లతో పలు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవేలు నిర్మాణం చేశారు. దీంతో ప్రస్తుతం ఇక్కడ జర్నీ సాఫీగా సాగుతోంది.

**ఒకప్పుడు రెండు లక్షల జనాభా ఉంటే..... నేడు పది లక్షలకు పైమాటే......**

ఒప్పుడు ఎల్‌బీనగర్ జనాభా సుమారుగా రెండు లక్షల జనాభా ఉండేది. ఇళ్లు కూడా దూర దూరంగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి వేరుగా మారిపోయింది. రోజురోజుకూ వలసలు రావడం, ఉపాధి కోసం వచ్చిన వారు ఇక్కడనే నివాసాలు ఏర్పాటు చేసుకోవడం, పెరుగుతున్న నిర్మాణాలకు అనుగుణంగా ఆంధ్రప్రాంతం నుంచి మేస్త్రీలు, ఇతర కూలీలు రావడం జరుగుతోంది. ఈ విధంగా వలసలు పెరగడంపై చదువుల కోసం రావడం వలన ప్రస్తుతం ఎల్‌బీనగర్ జనాభా సుమారుగా 10 లక్షకు పైగా ఉన్నారు. అంటే అప్పుడు ఇప్పుడు తేడాలు గమనిస్తే హైరైస్ భవనాలు రావడమే ఇందుకు నిదర్శనం.



ఎల్‌బీనగర్‌లో హైరైస్ భవన నిర్మాణాలు

**జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మరిన్ని ఫ్లై ఓవర్లు....**

ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మరిన్ని ఫ్లై ఓవర్లు రానున్నాయి. దీంతో ఈ ప్రాంతం అంత ఫ్రీ జర్నీగా వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి అందుకు అనుగుణంగానే అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పనామా చౌరస్తాలో ఒక ఫ్లై ఓవర్. ఆటోనగర్ వద్ద, మరొకటి హయత్‌నగర్ వద్ద ఫ్లై ఓవర్లు నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఇక విజయవాడ రోడ్డు మొత్తం ఎటు చూసిన ట్రాఫిక్ అంతరాయం లేకుండా రయ్ రయ్ మంటూ వాహనాలు దూసుకపోనున్నాయి.

**రోజుకు 1000 బస్సులు.....**

ఎల్‌బీనగర్ చౌరస్తా నుంచి రోజుకు సుమారుగా ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాలు సుమారుగా 1000వరకు రోజు ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. ఇవి కాక మరో 500 కార్లు అంబులెన్స్‌లు, చిన్న చితకా వాహనాల ద్వారా రోజుకు సుమారుగా 2 లక్షల మందిని వారివారి గమ్య స్థానాలకు చేరవేస్తున్నాయి. తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సులు 600, ఆంధ్రాకు చెందిన ఆర్టీసీ బస్సులు 400 రోజు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి ద్వారా రోజుకు ఇక్కడ నుంచి సుమారుగా 2 లక్షల మంది వివిధ ప్రాంతాలకు ప్రమాణాలు సాగిస్తున్నారు. ఎక్కడ చూసిన బస్సులతో పాటు ప్రయాణికులతో ఎల్‌బీనగర్ జనసంద్రంగా మారుతోంది.

### మరో రెండు ఫ్లై ఓవర్లు నిర్మాణాలకు అంచనాలు....



నియోజకవర్గంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా మరో రెండు ఫ్లై ఓవర్లు నిర్మాణం చేపట్టనున్నారు. సాగర్‌హైవే రోడ్డులో హస్తినాపురం చౌరస్తా నుంచి బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వరకు బ్రిడ్జిని నిర్మాణం చేపడితే సాగర్‌హైవే పూర్తిగా సిగ్నల్ లెస్‌గా మారుతుంది. దీంతో వాహనాలు సాఫీగా వెళ్తాయి. మరొకటి ఎయిర్‌పోర్టు రూట్‌లో నిర్మాణం చేపట్టనున్నాం.

– ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

## మంత్రి పొన్నంకు వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దుర్గయ్యగౌడ్

**హస్తినాపురం:** మహాత్మాజ్యోతిబా పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ (విదేశీ విద్య) కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న స్కాలర్‌షిప్ ఏడాదికి కేవలం మూడు వందల మందికి మాత్రమే ఇస్తున్నారని దీనిని మూడు వేల వరకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సమాఖ్య అధ్యక్షులు ఎస్. దుర్గయ్య గౌడ్ కోరారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మినిస్టర్ క్వార్టర్స్‌లో కలసి దుర్గయ్యగౌడ్ వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్ ఐదువేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, బీసీల సంక్షేమం కోసం రూ. 20 వేల కోట్లతో సబ్‌ప్లాన్‌ను తీసుకురావాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల సంఖ్యను పెంచాలని బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన జరిగే విధంగా చూడాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందిచాలని దుర్గయ్యగౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాచాల యుగంధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి కూలిన చెట్టు



ఓల్డ్‌మలక్ పేట్‌లోని కాలనీలో గాలిదుమారానికి పక్కనే ఉన్న టెంపో వ్యాన్‌పై పడ్డ చెట్టు

**చాదర్‌ఘాట్:** ఓల్డ్‌మలక్‌పేట్‌లో శనివారం అర్ధ రాత్రి కురిసిన భారీ వర్షం, గాలిదుమారానికి కాలనీలో ఒక భారీ వృక్షం పక్కనే నిలిపి ఉన్న టెంపో వ్యాన్‌పై పడింది. ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కానీ టెంపోవ్యాను ధ్వంసం అయింది.

## వారాహిదేవికి ప్రత్యేక పూజలు



దేవాలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు..

**దిల్‌సుఖ్‌నగర్:** ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో వారాహి దేవి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలో విశేష 18 రకాల ద్రవ్యములతో అభిషేకం, మహిళలచే సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో విఠల్ శర్మ, సాయి కుమార్ శర్మ, రామశర్మ, శ్రీపతి శర్మ, అరుణ ,హేమ, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

## నూతన కమిటీ ఎన్నిక



శ్రీరామా హిల్స్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు

**మన్సూరాబాద్:** డివిజన్ పరిధిలోని శ్రీరామాహిల్స్‌కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికల అధికారి పి. జలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో చర్ల జైపాల్‌రెడ్డి ప్యానల్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అధ్యక్షునిగా చర్ల జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా డక్యానాయక్, కొత్త రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొడిగే స్వామిగౌడ్, కార్యదర్శిగా శరత్‌చంద్రారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా పాండు, సతీష్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మంగ అరుణ, శివలింగం, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శులుగా నల్లరాము, రామలింగం, కార్యవర్గ సభ్యులుగా తిరుమల్‌రెడ్డి, నాగిరెడ్డి, పరిపూర్ణాచారి, బుచ్చయ్య, దయానంద్‌లు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

## 28న మన్సూరాబాద్‌లో బోనాలు



సమావేశంలో చర్చిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, నాయకులు

**మన్సూరాబాద్:** మన్సూరాబాద్‌లోని పోచమ్మ దేవాలయంలో ఈ నెల 28న ఆషాఢ మాస బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బోనాల పండుగ ఏర్పాట్లకు ముందస్తు సమావేశం ఆదివారం దేవాలయ ప్రాంగణంలో చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి మాట్లాడుతూ బోనాలు సమర్పించే భక్తులకు, ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, నాయకులు యాదయ్య యాదవ్, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, నాపంల్లి కృష్ణ తదితరులున్నారు.

## ట్రాఫిక్, శానిటేషన్ సమస్యలను పరిష్కరిస్తాం



జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అధికారులు

**కాలనీల అసోసియేషన్ సమావేశంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

**వనస్థలిపురం:** వనస్థలిపురం రైతుబజారు కూడలి, స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం తూర్పు కాలనీల అసోసియేషన్ (జేఏసీ) ఆధ్వర్యంలో వివిధ సమస్యలపై కమలానగర్‌కాలనీ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆటోనగర్ వద్ద ఇసుక లారీల అడ్డా తొలగింపునకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వనస్థలిపురం రైతుబజారు కూడలిలో తోపుడు బండ్లు, షెడ్ల దుకాణాదారులు రోడ్డు పైకి వచ్చి వ్యాపారాలు చేస్తుండడంతో అక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతూ వివిధ కాలనీలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాలనీలలో చెత్త వాహనాలు సరిగా రావడం లేదని, డ్రైనేజీ సమస్యలు, దోమల బెడద, సీసీ కెమెరాలు మంజూరు చేయాలని కోరారు. హైవేపై ఇసుక లారీ అడ్డా వద్ద హిజ్రాలలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజారు వద్ద చిరువ్యాపారులు రోడ్డుపైకి రాకుండా మార్కింగ్ ఏర్పాటు చేయాలని, కొందరు వ్యాపారస్తులను పక్కనే ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం వద్దకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. కాలనీలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా చెత్తను రోడ్లపై వేయకుండా తమ ఇంటి వద్దకు వచ్చే వాహనాలలోనే వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ యాదయ్య, వనస్థలిపురం ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వనస్థలిపురం లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ఎస్ఐ ఏడుకొండలు, జేఏసీ సభ్యులు శ్రవణ్‌కుమార్, లక్ష్మణ్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నర్సింహారావు, శ్రీనివాస్, జగన్ మోహన్, శ్రీకాంత్, దివాకర్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భారతి అల్ట్రాఫాస్ట్‌తో వేగంగా నిర్మాణ ప్రక్రియ



బ్రోచర్లు అందజేస్తున్న టెక్నికల్ ఇంజినీర్ సాహెర్, శ్రీ జగదీశ్వరీ ట్రేడర్స్ యజమాని

**సైదాబాద్:** సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహమ్మద్ సాహెర్ తెలిపారు. ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని శ్రీజగదీశ్వరీ ట్రేడర్స్ డీలర్ షాపులో తాపీమేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపిక అన్నారు. శ్రీ జగదీశ్వరీ ట్రేడర్స్ యజమాని శ్రీనివాస్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వారి సర్వీస్ చాలా వేగంగా ఉంటుందని ప్రశంసించారు. ఈ సమావేశంలో పలువురు తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**మన్సూరాబాద్:** కులం పేరును చెప్పుకోలేని రోజుల నుంచి ఇప్పుడు కులం పేరును పక్కన పెట్టుకునే స్థాయికి ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తీసుకొచ్చారని ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ అన్నారు. ఆదివారం ఎంఆర్‌పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎల్‌బీనగర్‌లోని డా.బీఆర్. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ము శేఖర్ మాదిగ, రాజ మాదిగ, లింగం మాదిగ, మౌలాలి మాదిగ, సురేష్ మాదిగ, యాదగిరి మాదిగ, మహార్షి మాదిగ, నాగరాజు మాదిగ, నర్సింహ్మ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్

**లింగోజిగూడ:** రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును చోరీ చేసిన సంఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. నాగోలు డివిజన్ పరిధిలోని లక్ష్మీ నర్సింహ్మా స్వామి కాలనీలో నివాసం ఉండే సుక్కమ్మ స్థానికంగా వాచ్‌మెన్‌గా పని చేస్తుంది. ఆదివారం సుక్కమ్మ శుభకార్యానికి వెళ్లి వస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును చోరీ చేశారు. దీంతో సుక్కమ్మ నాగోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్‌బీనగర్ సమగ్ర అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్

**ఎంపీ ఈటల రాజేందర్**

**హస్తినాపురం:** ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలో వివిధ కాలనీల సంక్షేమ సంఘాలు, బీజేపి కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంటు దేశంలోనే అత్యధిక ఓటర్లు కలిగి ఉన్నారని ఈ ప్రాంతాన్ని అబివృద్ధి చేసి అందరి ప్రజల మన్ననలు పొందుతా నని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపి పార్టీ అధ్యక్షుడు సామరంగా రెడ్డి, హస్తినాపురం డివిజన్ బీజేపి పార్టీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, కొత్త రవీందర్‌గౌడ్, కళ్ళెం రవీందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, అమరేందర్ రెడ్డి, మల్లేశ్‌గౌడ్, చిలుకూరి రాజేందర్, అరుణ్‌సింగ్,రాజుగౌడ్, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వృద్ధుడి మృతి



**చంచల్‌గూడ:** చంచల్‌గూడ జూనియర్ కాలేజీ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మాదన్నపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పీఎస్ పరిధిలో పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా చంచల్‌గూడ జూనియర్ కాలేజీ వద్ద ఫుట్‌పాత్‌పై సుమారు 55 సం॥ వయస్సు కలిగిన వృద్ధుడి మృతదేహం కనిపించింది. మృతి చెందిన వృద్ధుడు చాలాకాలంగా అక్కడే భిక్షాటన చేసేవాడని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.



## ఇళ్ల మధ్య సెల్ టవర్లకు అనుమతులు ఇవ్వొద్దు



ద్వారకామయినగర్‌లో సెల్‌టవర్ వద్ద కార్పొరేటర్‌తో మాట్లాడుతున్న కాలనీవాసులు

**వనస్థలిపురం:** జనావాసాల మధ్య సెల్ టవర్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ద్వారకామయినగర్ కాలనీలో ఓ ఇంటిపై సెల్ టవర్ నిర్మిస్తున్నారని సమాచారం అందడంతో ఆయన ఆదివారం కాలనీవాసులతో కలసి సెల్ టవర్ నిర్మిస్తున్న ఇంటి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇళ్ల మధ్య సెల్ టవర్లు నిర్మిస్తే దాని వల్ల వచ్చే రేడియేషన్‌తో స్థానికులకు పలు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, పిల్లలు వ్యాధుల బారినపడే అవకాశం ఉందని అన్నారు. సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సీసీపీలకు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రభులింగం, కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, సంక్షేమ సంఘం నాయకులు జనార్ధన్, శ్రీధర్‌రాజు, శ్రీధర్‌రెడ్డి, కృష్ణ, సాగర్, సరస్వతి, ఉమా యాదవ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## దోమలు వృద్ధి చెందకుండా మహిళలు ముఖ్య పాత్ర పోషించాలి

**ఎంటమాలజిస్ట్ సర్కిల్–6 ఏఈ శ్రీనివాస్**

**చాదర్‌ఘాట్:** దోమలు వృద్ధి చెందకుండా వాటిని పూర్తిగా నిర్మూలించాలని దానికి మహిళలే ముఖ్య పాత్ర పోషించాలని మలక్‌పేట సర్కిల్–6 ఎంటమాలజీస్టు శ్రీనివాస్ తెలిపారు. మలక్‌పేటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇళ్లలో రోజుల తరబడి ఒకేచోట నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సి బాధ్యత మహిళలదే అని అన్నారు. అంతే కాకుండా తమ ఇంటికి వచ్చే ఎంటమాలజీస్టు సిబ్బంది దోమల నివారణ కోసం చెప్పే విషయాలు జాగ్రత్తగా విని అమలు చేయాలని తెలిపారు. డెంగీ వైరస్ సోకిన తరువాత బాధపడే కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకొని వ్యాధులు దరిచేరకుండా చూసుకోవాలన్నారు. పగలు కుట్టే దోమకాటుతోనే డెంగీ వైరస్ సోకుతుందని అన్నారు. దోమల నివారణకు ప్రతిరోజూ ఎంటమాలజీస్టు సిబ్బందితో ఫాగింగ్ కూడా చేస్తున్నామని ఆయన తెలిపారు. కాలనీవాసులు కూడా తమ వంతు బాధ్యతగా దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

**మొదటిసారి ఏకగ్రీవం**
**– చైర్మన్‌గా శామ్‌కుమార్**

**చైతన్యపురి:** దక్షిణ షిర్డీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్ శ్రీసాయి సంస్థాన్ ట్రస్ట్ నూతన పాలకమండలి సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ట్రస్ట్ ఏర్పాటు అయిన తరువాత మొట్టమొదటి సారి ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా పాలకమండలిని ఎన్నుకోవటం గమనార్హం. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న గుండ మల్లయ్య ట్రస్టీ సభ్యులను ఏకతాటిపై తీసుకొచ్చేందుకు చేసిన కృషి ఫలించింది. రెండు సంవత్సరాలు పదవిలో కొనసాగే నూతన పాలకమండలి సభ్యులతో ఎన్నికల అధికారి ఆదివారం సాయి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేయించారు.

**నూతన పాలకమండలి సభ్యులు....**

సాయి ట్రస్ట్ నూతన పాలకమండలి చైర్మన్‌గా బివి.శ్యామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రఘుకుమార్, కోశాధికారిగా పూరనర్సింహగుప్త, వైస్ చైర్మన్‌లుగా ఆర్. శివశంకరరావు, పి.వీరప్ప, జాయింట్ సెక్రటరీలుగా కోడి రాజశేఖర్, బి.కిరణ్‌కుమార్, ఈసీ మెంబర్‌లుగా పద్మాకర్ అత్రే, ఎం.శ్యామలరావు, సాయికృష్ణ షిండే, పి.కృష్ణవేణి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. తాజా మాజీ చైర్మన్ గుండ మల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్‌లు బచ్చు గంగాధర్, వనం యాదయ్య, వనం రంగయ్య, ఇవివి నాగేశ్వరరావు శర్మ, వి.బాబురావు, వివి రవికుమార్, ఎస్‌వీపి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు**

సాయి ట్రస్ట్ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికలు లేకుండా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే అభినందించారు.



సాయిట్రస్ట్ నూతన పాలకమండలి సభ్యులు

## ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

**ఎల్‌బీనగర్:** దోమల నివారణకు ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. ఆదివారం ప్రతిరోజూ డ్రైడే కార్యక్రమంలో భాగంగా హయత్‌నగర్ డివిజన్ పరిధిలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ మాట్లాడుతూ నీటి నిల్వ ప్రాంతాలలో దోమలు అధికంగా వృద్ధి చెందుతాయని ప్రతి ఒక్కరూ ఇంట్లో ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సిబ్బంది ఎప్పటికప్పుడు కాలనీలను సందర్శిస్తూ ఫాగింగ్ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, సీనియర్ ఎంటమాలజీస్ట్ రజినీ తదితరులు పాల్గొన్నారు.